క్లుప్తంగా

బదిలీ దరఖాస్తులకు ముగిసిన గడువు



వివరాలు వెల్లడిస్తున్న ఎంఈవో రవీంద్ర భారతి

ఉంగుటూరు: ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి దరఖాస్తు చేసుకోవడానికి గడువు మంగళవారంతో ముగిసిందని ఎంఈవో నిమ్మగడ్డ రవీంద్ర భారతి తెలిపారు. ఉంగుటూరు మండలంలో నలుగురు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, 92 మంది స్కూల్ అసిస్టెంట్లు, 67 మంది ఎస్‌జీటీలు, ఇద్దరు లాంగ్వేజ్ పండిట్లు బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీరిలో ప్రధానోపాధ్యాయులకు, స్కూల్ అసిస్టెంట్లకు ఆన్‌లైన్ వెబ్ ఆధారిత కౌన్సిలింగ్ ద్వారా ఎస్‌జీటీలకు ఆఫ్‌లైన్‌లో మేన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు నిర్ధేశిత షెడ్యూల్ ప్రకారం జరుగుతాయని తెలిపారు.

చినదళితవాడకు తాత్కాలిక రోడ్డు



నిర్మాణంలో ఉన్న సైఫన్ పక్కన ఏర్పాటు చేసిన రోడ్డు

దెందులూరు: దెందులూరు సైఫన్ వద్ద నిర్మాణ పనుల్లో భాగంగా చినదళితవాడ ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడకుండా తాత్కాలికంగా రోడ్డును ఏర్పాటు చేశారు. సైఫన్ శిథిలావస్థకు చేరడం సాగునీటి అవసరాలకు భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు పడకుండా 7 గ్రామాల ప్రజల ప్రయోజనం కోసం సైఫన్ నిర్మాణం ఇటీవల ప్రారంభించారు. ఈ నేపథ్యంలో సైఫన్ పక్క నుంచి ఉన్న దారి నిర్మాణంలో ఉండటంతో ప్రత్యామ్నాయంగా దారిని అధికారులు ఏర్పాటు చేశారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

భీమడోలు: మండలంలోని గుండుగొలను గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను మంగళవారం ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ప్రారంభించారు. అదే విధంగా అదే గ్రామంలోని గోదావరి కాలువ నుంచి కుండీల గట్టు వరకు ట్యాంకు స్లూయిజ్ పూడిక తీత పనులను ఆయన ప్రారంభించారు. పోలసానిపల్లిలోని ఓ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాఫ్, జిల్లా ఉపాధి కల్పన సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జాబ్ మేళాను నిర్వహించారు. పలు కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై ఉద్యోగ కల్పనకు నిర్వహణ, ఎంపిక ప్రక్రియను చేపట్టారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ శిరిబత్తిన కొండబాబు, మాజీ జెడ్పీటీసీ కరణం పెద్దిరాజు, నీటి సంఘం ప్రతినిధులు డోకల నాగేశ్వరరావు, కాబోతుల సోమేశ్వరరావు, ప్రత్తి మదన్, మూర్తి, నిమ్మకాయల గణ, నిరుద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు డ్రోన్ల వినియోగం

జంగారెడ్డిగూడెం: శాంతిభద్రతల పరిరక్షణలో డ్రోన్లను వినియోగిస్తున్నట్లు డీఎస్పీ యు.రవిచంద్ర తెలిపారు. డీఎస్పీ స్థానిక కార్యాలయానికి కేటాయించిన డ్రోన్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో జూదాలు, అల్లర్లు, అసాంఘిక కార్యక్రమాలు అరికట్టేందుకు డ్రోన్ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని డీఎస్పీ చెప్పారు. ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు తన కార్యాలయానికి డ్రోన్ కెమెరాను కేటాయించారని తెలిపారు. డ్రోన్ కెమెరాను డీఎస్పీ పట్టణంలో ఎగరవేసి, దాని పనితీరును పరిశీలించారు. రానున్న రోజుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని నేర చేదనను మరింత వేగవంతం చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎస్సై జబీర్, సిబ్బంది పాల్గొన్నారు.

పెరటి కోళ్ల పెంపకంపై శిక్షణ

బుట్టాయగూడెం: మండలంలోని కొల్లాయిగూడెంలో మంగళవారం డాక్టర్ వైఎస్సార్ ఉద్యానవన విశ్వవిద్యాలయం కృషి విజ్ఞాన కేంద్రంకు చెందిన డాక్టర్ దేవీ వరప్రసాద్ రెడ్డి పెరటికోళ్ల పెంపకంపై పలువురు రైతులకు, మహిళలకు శిక్షణ ఇచ్చారు. పెరటి కోళ్ళకు వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వికాస సంస్థ ప్రతినిధి బీఎస్ రాజు, జి. శ్రీనివాస్, జార్జి ఇన్‌స్టిట్యూట్ సిబ్బంది, మహిళా రైతులు, తదితరులు పాల్గొన్నారు.

అధిక లోడు వాహనాలకు జరిమానాలు

చింతలపూడి : పరిమితికి మించి అధిక లోడుతో తిరుగుతున్న లారీలు, టిప్పర్లపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. జిల్లాలోని చింతలపూడి, లింగపాలెం మండలాల్లో ఏలూరు వెళ్లే ప్రధాన రహదారిపై పరిమితికి మించి అధిక లోడుతో తిరుగుతున్న లారీలు, టిప్పర్లకు మంగళవారం రోడ్డు టాక్స్, ఫిట్నెస్ లేని వాహనాలను గుర్తించి అపరాధ రుసుం విధించినట్లు రవాణా శాఖ అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో పాల్గొన్న నూజివీడు అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు అన్నపూర్ణ, కృష్ణవేణి మాట్లాడుతూ వాహనచోదకులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్‌ఫోన్లను ఉపయోగించవద్దని, ఇతరులతో మాట్లాడకూడదని అన్నారు.

పడకేసిన పల్లె వైద్యం

- నిలిచిపోయిన ఇంటి వద్దకే వైద్య సేవలు
- ప్రైవేట్ ఆసుపత్రుల చుట్టూ రోగుల ప్రదక్షిణలు



ఇంటి వద్దనే వైద్య పరీక్షలు అందజేస్తున్న వైద్యులు (ఫైల్)

దెందులూరు: ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు అవసరమైన మందులు అందుబాటులో లేక దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే గ్రామీణ ప్రాంత రోగులు నానా అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వంలో పేదల సంక్షేమం కోసం ప్రవేశ పెట్టిన ఫ్యామిలీ పిజీషియా కార్యక్రమం పేద రోగులకు వరంలా ఉండేది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో నేడు పూర్తి స్థాయిలో వైద్యం అందక ప్రైవేట్ ఆసుప్రతుల చుట్టూ తిరగాల్సి వస్తోందని పలువురు రోగులు వాపోతున్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే రోగులు ఆరోగ్యశ్రీలో శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారు, గర్భిణులు, బాలింతలు వైద్య పరీక్షల కోసం గతంలో పట్టణాలకు వెళ్లేవారు. గత ప్రభుత్వం అమలు చేసిన ఫ్యామిలీ పిజీషియా విధానం ద్వారా నిర్దేశిత సమయంలో రోగుల ఇళ్ల వద్దకే వైద్యులు, ఆరోగ్యశాఖ సిబ్బంది వచ్చి వైద్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందించే వారు. నేడు గ్రామాల్లో ఎక్కడా ఎటువంటి వైద్య శిబిరాలు కానరాకపోవడంతో రోగులు పడే పాట్లు వర్ణాతీతం. రెక్కాడితే కాని డొక్కాడని పేదలకు నేడు జబ్బు చేసిందంటే ఎక్కడికి వెళ్లాలో తెలియని పరిస్థితి ఏర్పడింది.

షుగర్, బీపీ పేషెంట్లకు భరోసా లేదు

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వయస్సుతో నిమిత్తం లేకుండా షుగర్, బీపీ వంటి రోగాలు జనాలను పట్టి పీడిస్తున్నాయి. వీటి వలన రోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పేద ప్రజలు వీటికి వైద్యం చేయించుకోలేక, మందులు కొనుగోలు చేసుకోలేక ప్రాణాల మీదకు తెచ్చుకున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఇన్సులిన్ సరఫరా ఆగిపోవడంతో రోగులు అల్లాడిపోతున్నారు. సొమ్ములు ఇచ్చి కొనుగోలు చేసుకోలేక, పెద్ద ఆసుప్రతులకు వెళ్లి వైద్యం చేయించుకోలేక రోగులు నానా పాట్లు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇన్సులిన్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ వైద్యులను ఆశ్రయించాల్సి వస్తోందని వారంటున్నారు.

నియోజకవర్గంలో 56 వేల మంది మధుమేహ వ్యాధిగ్రస్తులు

దెందులూరు నియోజకవర్గంలో షుగర్ వ్యాధిగ్రస్తులు 56000 మంది ఉండగా వీరిలో పేదలు 44000 మంది ప్రభుత్వ ఆసుప్రతుల్లో చికిత్స పొందేవారే. వీరిలో ఇన్సులిన్ తీసుకునే దశలో ఉన్న మధుమేహ రోగులు 13 వేల మంది వరకూ ఉన్నారు. వీరు ప్రతి రోజూ ఇన్సులిన్ తీసుకోవాల్సి ఉంది. ఇందులో పేదలు ఉండటం వలన ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక స్తోమత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మందులు అందుబాటులో ఉంచాలి

ప్రభుత్వ ఆసుపత్రుల్లో షుగర్ నివారణకు పూర్తి స్థాయిలో మందులు అందుబాటులో ఉండటం లేదు. ముఖ్యంగా ఇన్సులిన్ అందుబాటులో లేదు. కొన్ని మందులు మాత్రమే ఇస్తున్నారు. దీని వలన దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రుల్లో మందులు అందుబాటులో ఉంచాలి.

ఆదుకున్న ఆరోగ్య సురక్ష

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం గ్రామాల్లో నిర్వహించినపుడు రోగులు ఆనందించే వారు. వైద్య శిబిరాలకు వచ్చిన వారిని వైద్య నిపుణులతో ఆరోగ్య పరీక్షలు చేసి రోగ నిర్ధారణ అనంతరం వారిని మెరుగైన వైద్యం కోసం పెద్ద ఆసుపత్రులకు తరలించే వారు. నేడు గ్రామీణ ప్రాంతాల్లో రోగులకు నిత్యం వైద్య సేవలందించాలనే ఉద్దేశ్యంతో ప్రతి నెలా రెండు సార్లు వైద్య శిబిరాలు నిర్వహించే వారు. నేడు ఆ పరిస్థితి లేదు. కనీసం మందులు కూడా అందుబాటులో ఉండటం లేదని రోగులు దీనంగా చెబుతున్నారు.

మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి



గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి చేస్తున్నాం. రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నాం. ప్రతి నెలా గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి రోగులకు సేవలు అందిస్తున్నాం.

– డాక్టర్ సుందర్‌కుమార్, సూపరింటెండెంట్, దెందులూరు సీహెచ్‌సీ

సరిపడా సిబ్బంది లేరు



నియోజవర్గ వైద్యశాల దెందులూరు సీహెచ్‌సీలో జనరేటర్ లేదు. సర్జన్ పోస్టు ఖాళీగా ఉంది. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.2.75 కోట్లతో నూతన భవనాలు నిర్మించారు. అధునాతన పరికరాలు ఏర్పాటు చేశారు. సెక్యూరిటీ గార్డులు, శానిటరీ సిబ్బంది పోస్టులు భర్తీ చేయలేదు.

– కట్టా ఏసుబాబు, సీహెచ్‌సీ మాజీ సలహా కమిటీ సభ్యుడు, దెందులూరు

చురుగ్గా రామాలయ నిర్మాణ పనులు



గోపన్నపాలెంలో నిర్మాణంలో ఉన్న రామాలయం

దెందులూరు: గోపన్నపాలెం గ్రామంలో ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట రామాలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. దాతలు గ్రామస్తుల ఆర్థిక సాయంతో రామాలయ నిర్మాణం చేపట్టారు. ప్రతిరోజూ ఆలయ ఆవరణలో విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధి ప్రభాకరరావు, భక్తులు, భజనలు నిర్వహిస్తున్నారు.

కిన్నెరసాని వాగు వద్ద పికెట్ ఏర్పాటు

కుక్కునూరు: తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల సరిహద్దు మధ్య గల కిన్నెరసాని వాగు నుంచి ఇసుకను తరలించకుండా సిబ్బందితో పికెట్‌ను ఏర్పాటు చేయనున్నట్టు తహసీల్దార్ రమేష్ తెలిపారు. తెలంగాణలోని బూర్గంపాడు మండలంలో ప్రభుత్వ ఆసుపత్రి మరమ్మతుల నిమిత్తం కాంట్రాక్టర్ తెలంగాణ పరిధిలోకి వస్తుందంటూ కిన్నెరసాని వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న విషయంపై కుక్కునూరు రెవెన్యూ, పోలీస్ అధికారులు మంగళవారం సర్వే చేశారు. ఇసుక తరలిస్తున్న ప్రాంతం ఆంధ్రప్రదేశ్ పరిధిలోకి వస్తుందని నిర్ధారించారు. ఇకపై ఆంధ్రా ప్రాంతం నుంచి ఇసుకను తరలిస్తే చట్టపరంగా కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఇసుక అక్రమ తరలింపును అడ్డుకునేందుకు పికెట్ ఏర్పాటు చేశామన్నారు.

ఎండు తెగులుతో నిమ్మ రైతు దిగాలు



పూర్తిగా ఎండిపోయిన నిమ్మ చెట్టు

దెందులూరు: నిమ్మ చెట్లకు ఎండు తెగుళ్లు ఆశించాయి. ఆరుగాలం శ్రమించిన రైతన్నకు పెట్టుబడి ఖర్చుతో పాటు తెగుళ్లు కలవరపెడుతున్నాయి. మండలంలో సానిగూడెంతో పాటు కొన్ని గ్రామాల్లో ఎండు తెగుళ్లతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హార్టికల్చర్ ఉద్యోగులు బాధిత రైతుల పొలాలకు వెళ్లి తెగుళ్లను పరిశీలించి ప్రత్యామ్నాయం చూపాలని రైతులు కోరుతున్నారు. తెగుళ్లపై హార్టికల్చర్ అధికారులను వివరణ కోరగా ఎండు తెగుళ్లు వచ్చిన నిమ్మ చెట్లను వెంటనే పీకి వేరే ప్రాంతంలో వేయాలన్నారు. ఆ చెట్టుకు పెట్టిన నీరు వేరే చెట్లకు వెళ్లకుండా చూడాలన్నారు. నిమ్మ చెట్లకు పశువుల పేడ వేస్తూ సూడోమోనాక్స్‌డ్ మందును 2 లేదా 5 గ్రాములు వేయాలని రైతులకు సూచిస్తున్నారు. తెగుళ్లు ఆశించిన తోట రైతులు హార్టికల్చర్ అధికారులను సంప్రదించాలన్నారు.

సంఘ సంస్కర్త, బహుముఖ ప్రజ్ఞాశాలి కందుకూరి



భీమడోలు: కందుకూరి, నెహ్రూ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న మానవత జిల్లా డైరెక్టర్



కార్యక్రమంలో మాట్లాడుతున్న గ్రంథాలయాధికారి

భీమడోలు: సంఘ సంస్కర్త, బహుముఖ ప్రజ్ఞాశాలి కందుకూరి వీరేశలింగం పంతులు చేసిన సేవలు శ్లాఘనీయమని పలువురు వక్తలు అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో మంగళవారం వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు ఘనంగా నిర్వహించారు. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం పంతులు వర్ధంతి, భారత తొలి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతిని నిర్వహించారు. వారి చిత్రపటాలకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్, విద్యార్థులు నివాళులర్పించారు. కార్యక్రమాల్లో గ్రంథపాలకులు కె.శ్రీనివాస్, డీఎస్‌టీ అమర్‌నాథ్, జి.నాగమణి, రిసోర్స్‌పర్సన్ ఈతకోట భవ్యశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.

కందుకూరికి ఘన నివాళి

పెదపాడు: మండలంలోని పెదపాడు శాఖా గ్రంథాలయంలో కందుకూరి వీరేశలిగం పంతులు వర్ధంతిని నిర్వహించారు. పెదపాడు శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా విద్యార్థినీ విద్యార్థులకు వీరేశలింగం పంతులు జీవిత చరిత్రను తెలిపారు. స్త్రీ విద్యకు ఆయన ఉద్యమించన తీరును వివరించారు. అనంతరం విద్యార్థులకు నృత్యంపై అవగాహన శిక్షణ అందించారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామాల బెంజిమన్ జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించిన విషయాలు విద్యార్థులకు వివరించారు.

యోగాంధ్రను సద్వినియోగం చేసుకోవాలి



దెందులూరు: కొవ్వలిలో ర్యాలీలో పాల్గొన్న సీడీపీఓ డాక్టర్ సునీల్ రాజశేఖర్

భీమడోలు: యోగాంధ్ర లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మాస్టర్ ట్రైనీ సత్యేంద్ర అన్నారు. భీమడోలు ఎంపీడీవో, పంచాయతీ కార్యాలయాల వద్ద యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా పంచాయతీ, సచివాలయ ఉద్యోగులు యోగా శిక్షణ తరగతుల్లో పాల్గొని యోగాసనాలు వేశారు. శ్వాస మీద ధ్యాస పెట్టి పట్టు సాధించడం ద్వారా ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారన్నారు. సూర్యనమస్కారాలు, వివిధ ఆసనాలు వేయించారు. కార్యక్రమాల్లో అన్ని వర్గాల ఉద్యోగులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవిలు అన్నారు.

అంతర్జాతీయ యోగా దేను విజయవంతం చేయాలి

పెదవేగి : జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు శ్రీకారం చుట్టారని అందరూ ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీడీఓ పి.శ్రీనివాస్ అన్నారు. పెదవేగి మండలం పరిషత్ కార్యాలయంలో మంగళవారం యోగా ట్రైనర్లకు ఐదు రోజుల శిక్షణా కార్యక్రమం ఎంపీడీఓ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 21న విశాఖలో యోగా ఫర్ వన్ ఎర్త్, వన్ హెల్త్ అనే నినాదంతో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో యోగా శిక్షకుడు కె వినోద్ కుమార్ పాల్గొని, యోగసాధన చేశారు.



భీమడోలు: యోగాసనాలు వేస్తున్న ఉద్యోగులు



పెదవేగి: ఎంపీడీఓ కార్యాలయంలో యోగా ట్రైనర్‌లకు శిక్షణ ఇస్తున్న అధికారులు

జూన్ 21 వరకు అంగవాడీల్లో యోగాంధ్ర

దెందులూరు: జూన్ 21వ తేదీ వరకు పెదపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అన్ని అంగన్‌వాడీ, మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో యోగాంధ్ర శిక్షణ నిర్వహిస్తున్నామని పెదపాడు ఐసీడీఎస్ సీడీపీఓ డాక్టర్ సునీల్ రాజశేఖర్ అన్నారు. మంగళవారం కొవ్వలిలో సెక్టార్ సూపర్‌వైజర్ కె.శ్రీదేవి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ట్రైనర్లు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో సచివాలయ సిబ్బంది అన్నపూర్ణ, ప్రమీల, అంగన్‌వాడీ టీచర్ నాగవేణి, సహాయకులు జ్యోతి, కిషోర్‌బాలికలు, తల్లులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో యోగా శిక్షణ

ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యం కోసం యోగసాధన చేయాలని దెందులూరు ఎంపీడీఓ కే.శ్రీదేవి, ట్రైనర్ ప్రభాకరరావు అన్నారు. మంగళవారం దెందులూరు ఎంపీడీఓ కార్యాలయంలో మండల కార్యాలయ సిబ్బంది, మండలాధికారులు, గ్రామ సచివాలయ ఉద్యోగులకు ట్రైనర్ యోగా శిక్షణ ఇచ్చారు.

ఘనంగా అన్నసమారాధన

పెదపాడు: అప్పనవీడులో వేంచేసియున్న అభయాంజనేయస్వామి వారి ఆలయంలో మంగళవారం పుష్కరించుకుని అన్నసమారాధన ఘనంగా నిర్వహించారు. 200 మందికి నిర్వహించిన ఈ అన్నదానానికి హనుమాన్ జంక్షన్‌కు చెందిన తవ్వా జగదీష్ ఆర్థిక సాయం అందించారు.

వైభవంగా హనుమద్ జయంతి వేడుకలు



ఆంజనేయునికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

గణపవరం: హనుమాన్ జయంతి వేడులకు అంగరంగ వైభవంగా నిర్వహించారు. గణపవరంలోని ప్రసిద్ధ శ్రీసువర్చలా సహిత ఆంజనేయస్వామి వారి ఆలయంలో వైభవంగా జరిగాయి. ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తమల పాకుల పూజ చేశారు. హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. బువ్వనపల్లిలోని శ్రీఅభయాంజనేయస్వామి వారి ఆలయం వద్ద హనుమాన్ జయంతి వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని, పరిసర ప్రాంతాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. బుధవారం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహిస్తారని ఆలయ కమిటీ ప్రకటించింది.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ మెండు



రైఫిల్ షూటింగ్‌లో సత్తా చాటుతున్న కేడెట్లు



కేడెట్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్న ఆర్మీ సిబ్బంది

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 604 మంది కేడెట్ల హాజరు
- వృత్తి నైపుణ్యాలపై అవగాహన కల్పిస్తున్న ఆర్మీ అధికారులు

పెదవేగి: ఎన్‌సీసీతో విద్యార్థులు క్రమ శిక్షణ కలిగి ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండలంలోని పినకడిమి గ్రామంలో విన్సెంట్ డీ పాల్ కళాశాల ఎన్‌సీసీ క్యాంప్‌లో పలు ప్రాంతాలకు చెందిన పాఠశాల, కళాశాలల విద్యార్థులు ఒక చోట చేరి నైపుణ్యాలపై అవగాహన పెంపొందించుకుంటున్నారు. ఈ క్యాంప్ మే 14 నుంచి 23 వరకు నిర్వహించారు. మొత్తం 8 కళాశాలలు, 11 పాఠశాలల నుంచి 604 మంది కేడెట్లు పాల్గొన్నారు. ఇండియన్ ఆర్మీ 19వ ఆంధ్రా బెటాలియన్ కల్నల్ అమిత్ పాండే ఆధ్వర్యంలో ఎన్‌సీసీ శిక్షణ ఉత్సాహంగా సాగింది. ఇందులో శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేయడంతో పాటు పలు రకాల ఉద్యోగాల్లో, కళాశాల ప్రవేశాల్లో ప్రాధాన్యత కల్పిస్తారు. శిక్షణలో భాగంగా రైఫిల్ షూటింగ్, డ్రిల్, దేశ సరిహద్దుల్లో ఆర్మీ శిబిరాలు ఏ విధంగా ఉంటాయో కళ్లకు కట్టినట్లు చూపించి కేడెట్లకు అవగాహన కల్పించారు. ఎన్‌సీసీలో శిక్షణ ద్వారా దేశభక్తి, నైతిక విలువలు పెంపొందించడం, క్రమశిక్షణ అలవడతాయని అధికారులు పేర్కొంటున్నారు. కార్యక్రమంలో సుబేధార్లు, మేజర్లు వినోద్‌కుమార్, లింబూ, ఎన్‌సీసీ అధికారులు కెప్టెన్ శివశంకర్, సెకండ్ ఆఫీసరుల ప్రకాష్, బీఎస్ స్వామి, సంజయ్‌గాంధీ, థర్డ్ ఆఫీసర్లు గంగరాజు, లేడీ కేర్ టేకర్ విజయలక్ష్మి, కేర్ టేకర్ చీలి తంబి, సూపరింటెండెంట్ కొండయ్య, ఆర్మీ, సివిల్ సిబ్బంది ఈ ఎన్‌సీసీ క్యాంప్‌ను ఉత్సాహంగా నిర్వహించారు.

యూపీఎస్సీ పరీక్షకు దోహదం



యూపీఎస్సీ పరీక్షకు ఎన్‌సీసీ మొదటి స్టెప్‌గా భావించి ఇందులో చేరాను. ఎన్‌సీసీ క్యాంపులో కలిసికట్టుగా ఉంటే దేనినైనా సాధించొచ్చని గ్రహించాను. నాలో ఆత్మస్థైర్యం పెంపొందించేలా ఆర్మీ అధికారులు ఎంతో శిక్షణ ఇచ్చారు. ఇది నాకు మొదటి క్యాంప్. ఇలాంటి క్యాంపులు మరిన్ని చేయాలని ఉంది.

– కేజీ మంగ, బీఎస్సీ సెకండ్ ఇయర్, శ్రీవేంకటేశ్వర కళాశాల, భీమడోలు

మిలటరీ క్రమశిక్షణ నేర్పించాం



ఈ క్యాంప్‌లో మిలటరీ క్రమశిక్షణను విద్యార్థులు నేర్చుకున్నారు. ఇందులో ప్రధానంగా మ్యాప్ రీడింగ్, షూటింగ్, నేషనల్ ఇంటిగ్రేటర్ సిమిలేటర్ ఫైరింగ్, వెపన్ హ్యాండ్లింగ్ వంటి విషయాలను నేర్పించాం. క్యాంప్‌లో విద్యార్థులు చాలెంజ్‌లను స్వీకరించడం, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవడం వంటి వాటిని నైపుణ్యం కలిగిన వారితో అవగాహన కల్పించాం. అన్ని రకాల శిక్షణ ఇక్కడ ఇస్తున్నాం.

– కల్నల్ అమిత్‌పాండే, క్యాంప్ కమాండింగ్ అధికారి, 19వ ఆంధ్రా బెటాలియన్

తెనాలిలో పోలీసుల చర్య అరాచకం

గణపవరం: తెనాలిలో పోలీసులు వ్యవహరించిన తీరు అరాచకమని కుల వివక్ష పోరాట సమితి జిల్లా సహాయ కార్యదర్శి చిన్నం చిననాగేశ్వరరావు అన్నారు. రాష్ట్రంలో బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం అమలవుతుందా లేక లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతుందా అని కుల వివక్ష పోరాట సమితి జిల్లా సహాయ కార్యదర్శి చిన్నం చిన నాగేశ్వరరావు ప్రశ్నించారు. తెనాలిలో ముగ్గురు దళిత, మైనార్టీ యువకులపై నడి రోడ్డు మీద పోలీసులు బరితెగించి వారిని చిత్రహింసలకు గురి చేసిన సంఘటన ప్రజాస్వామ్యానికి చెంపపెట్టని అన్నారు. యువకులను అరికాళ్లపై పోలీసులు లాఠీలతో కొట్టడం, బాధ్యతాయుతంగా బూటు కాళ్లతో తొక్కిపెట్టి మరీ థర్డ్ డిగ్రీ ప్రయోగించడం దారుణమన్నారు. ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుకగా చెప్పుకునే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ సంఘటనపై ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఈ సంఘటనను మానవ హక్కుల సంఘం సుమోటోగా స్వీకరించి విచారణ చేయాలని కోరారు. బాధ్యులైన పోలీసు అధికారులను ఉద్యోగాల నుంచి తొలగించి, వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ఆదాయం ఫుల్.. ఆదరణ నిల్!



రంగులు వెలిసిపోయిన శ్రీరామాలయ గోపురం

దెందులూరు: సానిగూడెం గ్రామంలోని 150 ఏళ్ల నాటి శ్రీ రామాలయం గోపురం పట్ల దేవాదాయశాఖ సవితి తల్లి ప్రేమ చూపిస్తుంది. శ్రీరామాలయానికి 26 ఎకరాల సాగు భూమి ఉంది. ప్రతి ఏటా పంటలు పండి ఆదాయం దేవాదాయ శాఖకు వస్తున్నా రాయాలయాన్ని పట్టించుకోవడం లేదు. సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా జిల్లాలో అతిపురాతమైన దేవాలయాల్లో ఒకటిగా విశిష్టత గల శ్రీరామాలయం పట్ల దేవాదాయ శాఖ నిర్లక్ష్యానికి భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏటా లక్షల్లో ఆదాయం ఉన్నప్పటికీ గోపురానికి రంగు వేయడానికి కూడా దేవాదాయశాఖ ఆసక్తి కనబరచకపోవడం తగదన్నారు. తాటిచెట్టు ఎత్తు పైనే ఉన్న గోపురం పైభాగంలో మొక్కలు పెరిగిపోయాయంటే అధికారుల శ్రద్ధ ఎంత బాగుందో అర్థమవుతుంది. ఆలయ విశిష్టత భక్తుల మనోభావాలు దృష్టిలో పెట్టుకుని దేవాదాయశాఖ ప్రత్యేక నిధులు కేటాయించకపోయినా దేవుడికి వచ్చే ఆదాయంలో గోపురానికి రంగులు వేయించాలని కోరుతున్నారు.